
www.prajasakti.com
ప్రజాశక్తి
శనివారం 15 ఫిబ్రవరి 2025
5
ఏలూరు



కొనసాగుతున్న కోళ్ల ఖననం

ప్రజాశక్తి - ఉంగుటూరు

బాదంపూడి పౌల్ట్రీ ఫారాల్లో బర్డ్ ఫ్లూ సోకిన కోళ్లను ఖననం చేసే ప్రక్రియ రెండో రోజు శుక్రవారం కొనసాగింది. రాపిడ్ యాక్షన్ టీమ్ పిపిఇ సూట్లు ధరించి కోళ్లను బయటకు తీసుకొచ్చి నిర్దేశిత ఆదేశాల ప్రకారం ఖననం చేశారు. మరోపక్క గ్రామంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఎంపిడిఒ గంజి రాజ్‌మనోజ్, ఇన్‌ఛార్జి తహశీల్దార్ పూర్ణచంద్ర ప్రసాద్ పరిస్థితులను పర్యవేక్షించారు.


బర్డ్ ఫ్లూ కోళ్లను తరలిస్తున్న రాపిడ్ యాక్షన్ టీమ్

స్థలం ఉన్నా... ఇల్లు లేదు..!

నెరవేరని గ్రామీణుల సొంతింటి కల
స్థలమున్నవారు ఇల్లు కట్టుకునేందుకు ఎదురుచూపు
కూటమిలో కదలిక లేని గృహనిర్మాణం
సర్వేల పేరుతో కాలక్షేపమేనని జనం నిర్వేదం
పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్లు స్థల హామీ అమలెప్పుడో

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కూటమి ప్రభుత్వం ఏర్పడి ఎనిమిది నెలలు గడిచిపోయింది. ఇప్పటి వరకూ పేదలకు ఇళ్ల నిర్మాణం, స్థలాల మంజూరుకు సంబంధించి ఒక్క అడుగూ ముందుకు పడలేదు. దీంతో సొంతింటి కల నెరవేర్చుకోవాలన్న ఆశ సామాన్య కుటుంబాలకు అందని ద్రాక్షగా మిగిలింది. ముందుగా సొంత స్థలం ఉండి ఇల్లు కట్టుకునే కుటుంబాలకు ప్రభుత్వం సాయం అందిస్తే ఎన్నో కుటుంబాలకు మేలు జరుగుతుంది. పట్టణ ప్రాంతాల్లో సొంత స్థలం ఉన్నవారికి ఇల్లు కట్టుకునే అవకాశం కల్పించినప్పటికీ గ్రామాల్లో మాత్రం అటువంటి పరిస్థితి లేదు. సర్వేల పేరుతో ప్రభుత్వం కాలక్షేపం చేస్తోందనే విమర్శలు విన్పిస్తున్నాయి. కొత్తగా ఇళ్లు నిర్మించుకునే వారికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు సాయం అందించనున్నట్లు ప్రకటించింది. కేంద్రం నుంచి రూ.లక్షన్నర, రాష్ట్ర ప్రభుత్వం రూ.లక్ష ఇవ్వనుంది. గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల నిర్మాణ ప్రక్రియ సక్రమంగా ముందుకు సాగలేదు. అంతేకాకుండా ప్రభుత్వం అందించే సాయం రూ.లక్షా 80 వేలకు కుదించింది. ఇసుక ధర ఆకాశాన్నంటింది. దీంతో ఇల్లు కట్టుకునేందుకు జనం భయపడేవారు. కూటమి అధికారంలోకొచ్చాక ప్రభుత్వ సాయం పెంచడంతో ఇళ్లు కట్టుకునేందుకు సొంత స్థలం ఉన్నవారు చాలా మంది ముందుకొస్తున్నారు. గ్రామాల్లో ఇంకా గృహ నిర్మాణాలకు సంబంధించిన ప్రక్రియ మొదలు కాలేదని అధికారులు చెబుతున్నారు. ఒకవేళ ముందుగా నిర్మించుకుంటే తర్వాత ప్రభుత్వ సాయం అందిస్తుందా అనే దానిపై స్పష్టత లేకుండా పోయింది.



అదేమని అడిగితే సొంత స్థలం ఉన్న కుటుంబాలపై సర్వే జరుగుతుందని చెబుతున్న పరిస్థితి ఉంది. 2014-19 టిడిపి పాలనలోనే ఇదే పరిస్థితి నెలకొంది. తొలుత మూడేళ్లపాటు ఇళ్ల నిర్మాణాలకు అవకాశం ఇవ్వకుండా తర్వాత ఇచ్చారు. ఇళ్ల నిర్మాణం పూర్తయ్యేసరికి 2019 ఎన్నికలు దగ్గరపడ్డాయి. టిడిపి ఓటమి పాలైంది. తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో గృహనిర్మాణదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అప్పట్లో ఇళ్లు నిర్మించుకున్నవారు ఏలూరు జిల్లాలో 26 వేలు, పశ్చిమగోదావరి జిల్లాలో 25 వేల మంది వరకూ ఉండగా రెండు జిల్లాల్లో రూ.81 కోట్లు బకాయి ఉందంటే పరిస్థితి ఏమిటో అర్థం చేసుకోవచ్చు. ఇప్పుడు సైతం ఆఖరులో ఇంటి నిర్మాణాలకు అవకాశం ఇచ్చి సొమ్ము చెల్లించకపోతే పరిస్థితి ఏమిటో అనే చర్చ సాగుతోంది. వెంటనే గ్రామీణ ప్రాంతాల్లో సొంతం స్థలం ఉన్నవారికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం సాయం అందించాలని అంతా కోరుతున్నారు.

ఇంటి స్థలం హామీ నెరవేరేదెప్పుడో..

గత ప్రభుత్వం పట్టణాల్లో సెంటు, గ్రామాల్లో సెంటున్నర చొప్పున ఇంటి స్థలాలు పంపిణీ చేసింది. చాలా లేఅవుట్‌లు ఊరికి దూరంగా ఉండటం, పల్లపు ప్రాంతాలు కావడంతో లబ్ధిదారుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. తాము అధికారంలోకి వస్తే పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు ఇంటి స్థలం ఇస్తామని కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఇప్పటి వరకూ అందుకు సంబంధించిన ప్రక్రియపై ఒక్క అడుగూ ముందుకు పడలేదు. స్థల సేకరణ వంటి ప్రక్రియ కూడా ఎక్కడా చేపట్టిన పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇంటిస్థలం హామీని ఎప్పటికి నెరవేరుస్తుందనే చర్చ జనాల్లో సాగుతోంది. ఇంకా అనేక కుటుంబాలకు ఇంటి స్థలం సైతం లేని పరిస్థితి ఉంది. అంతేకాకుండా వైసిపి ఇచ్చిన ఇంటిస్థలం ఎటూ చాలని పరిస్థితి ఉంది. వారికి కూడా ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం ఇంటిస్థలం కేటాయించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. గత వైసిపి ప్రభుత్వాన్ని విమర్శించడంతోనే ప్రభుత్వం సరిపెడుతోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను మాత్రం నెరవేర్చే ప్రయత్నాలు మాత్రం కనిపించడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి.

'పది' పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మార్చి 17 నుండి 31 వరకు పరీక్షలు
హాజరు కానున్న 25,179 మంది విద్యార్థులు
133 కేంద్రాల వద్ద 163-బి సిఆర్‌పిసి సెక్షన్ అమలు
కలెక్టర్ కె.వెట్రిసెల్వి



ప్రజాశక్తి - ఏలూరు

పదో తరగతి పరీక్షల నిర్వహణ కోసం పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో జిల్లా అధికారుల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్చి 17 నుంచి మొదలయ్యే పదో తరగతి పరీక్షలను ప్రశాంత వాతావరణంలో ఎలాంటి పొరపాట్లకూ తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలన్నారు. పరీక్షాపత్రాలు భద్రపర్చే కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. మార్చి 17 నుండి 31 వరకు పదో తరగతి రెగ్యులర్ వారికి, మార్చి 17 నుండి 28 వరకు ఓపెన్ స్కూల్స్ విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు ఉదయం 9.30 నుండి 12.45 వరకు జరుగుతాయన్నారు. రెగ్యులర్, ప్రయివేటు కలిపి జిల్లాలో 133 కేంద్రాల్లో 25,179 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు. ఓపెన్ స్కూల్స్ నుండి 793 మంది విద్యార్థులకుగాను 17 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా పరీక్షల సమయంలో అవసరమయ్యే బస్సులను నడపాలని, సంబంధిత సమయాలను ముందుగా తెలియజేయాలని ఆర్‌టిసి అధికారులను ఆదేశించారు. ఈ పరీక్షలు కట్టుదిట్టంగా, ఎక్కడా కాపీ జరగకుండా నిర్వహించాలని తెలిపారు. ప్రతి కేంద్రానికీ ఒక చీఫ్ సూపరింటెండెంట్‌ను, డిపార్టుమెంటల్ అధికారిని నియమించాలని, ఆరు ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని కేంద్రాల వద్ద 163-బి సిఆర్ పిసి సెక్షన్ అమలు చేయాలని, జిరాక్స్ కేంద్రాలను, నెట్ సెంటర్లను మూసివేయాలని తెలిపారు. 11 రూట్‌లను ఏర్పాటు చేసి రూట్ ఆఫీసర్లను నియమించాలన్నారు. పరీక్షా కేంద్రాలతోపాటు స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చూడాలని విద్యుత్ అధికారులను, తాగునీరు, పారిశుధ్యం ఏర్పాటు చేయాలని మున్సిపల్ కమిషనర్లను, డిపిఒను ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద, స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద మెడికల్ క్యాంపులను నిర్వహించి అత్యవసర మందులను సిద్ధంగా ఉంచాలని డిఎంహెచ్ఒకు సూచించారు. సమావేశంలో ఎఎస్‌పి ఎన్.సూర్యచంద్రరావు, డిఆర్ఒ వి.విశ్వేశ్వరరావు, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిటిసి షేక్ కరీమ్, జిల్లా ఖజానాధికారి టి.కృష్ణ, డిఎంహెచ్ఒ డాక్టర్ ఆర్.మాలిని, ఆర్‌టిసి డిఎం బి.వాణి, పోలీస్, విద్యుత్ శాఖల అధికారులు, ఆర్ఐఒ, పోస్టల్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎంఎల్‌సి ఎన్నికల ఏర్పాట్లు

నిర్వహణలో నిష్పక్షపాతంగా వ్యవహరించాలి
ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

ఈ నెల 27న జరిగే తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎంఎల్‌సి ఎన్నిక ప్రక్రియ స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్వహించేందుకు అధికారులు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లపై శుక్రవారం కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో ఆమె జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వి.విశ్వేశ్వరరావుతో కలిసి సమీక్షించారు. ఈ నెల 27న పోలింగ్ రోజున అనుసరించాల్సిన విధానం, వెబ్‌కాస్టింగ్, పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూమ్‌కు తరలించడం, రిసెప్షన్ సెంటర్లు, రూట్ అధికారులు, పోలీస్ బందోబస్తు, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లు, బ్యాలెట్ పేపర్లు, ఎంసిసి, ఎంసిఎంసి, పోస్టల్ బ్యాలెట్లు వంటి ఏర్పాట్లపై చర్చించారు. ఈ నెల 27న పోలింగ్‌కు ముందు నిర్వర్తించాల్సిన విధివిధానాలను, 27వ తేదీ పోలింగ్ ప్రారంభం నుంచి చివరివరకు


మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ఎటువంటి తప్పులకూ తావులేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో జరిగేలా కృషి చేయాలన్నారు. ఆరు జిల్లాల పరిధిలో జరిగే ఈ ఎన్నికల్లో మొత్తం 35 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారన్నారు. జిల్లాలో 87 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పోలింగ్ సిబ్బందికి నిర్ధేశించిన ప్రాంతంలో ఈ నెల 26వ తేదీ ఉదయం నుంచి పోలింగ్ సామగ్రి పంపిణీ మొదలవుతుందన్నారు. గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రులకు సంబంధించి నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం నుంచి పోలింగ్ సామగ్రి డిస్ట్రిబ్యూషన్ చేపట్టాలన్నారు. పిఒ, ఎపిఒలకు రెండో విడత శిక్షణా కార్యక్రమాన్ని ఈ నెల 22వ తేదీన నిర్వహించాలన్నారు. మార్చి 3వ తేదీన నిర్వహించే కౌంటింగ్ ఏర్పాట్లపైనా సమీక్షించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ కె.సుబ్బారావు, డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు, ఏలూరు ఆర్‌డిఒ అచ్యుత అంబరీష్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.ముక్కంటి, డ్వామా పీడీ వెంకటసుబ్బారావు, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ వి.శ్రీలక్ష్మి, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, ఎల్‌డిఎం డి.నీలాద్రి, డిసిఒ శ్రీనివాస్, జిల్లా ఖజానాధికారి టి.కృష్ణ, ఉద్యాన శాఖ డిడి రామ్మోహన్, ఆర్‌అండ్‌బి ఎస్ఇ జాన్‌మోషే, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ఎన్ఎస్.కృపావరం, జిల్లా వ్యవసాయ శాఖాధికారి హబీబ్ భాషా తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు దామోదరం సంజీవయ్య

జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

ప్రజాశక్తి - ఏలూరు

నిజాయంతీకి, నిరాడంబరత్వానికి, విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులని జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అన్నారు. మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జన్మదినోత్సవం సందర్భంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లోని గౌతమి సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జెసి ధాత్రిరెడ్డి మాట్లాడుతూ అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలకు మారుపేరైన దామోదరం సంజీవయ్య అందరికీ ఆదర్శప్రాయులని కొనియాడారు. ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి నిరోధక శాఖను ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ జెడి వి.జయప్రకాష్, సెట్‌వెల్ సిఇఒ ప్రభాకరరావు, జిల్లా బిసి సంక్షేమాధికారి ఆర్‌వి.నాగరాణి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఎన్ఎస్.కృపావరం, డిఇఒ వెంకటలక్ష్మమ్మ, కలెక్టరేట్ ఎఒ నాంచారయ్య, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



సంజీవయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జెసి ధాత్రిరెడ్డి

నష్టపోయాం...న్యాయం చేయండి

మొక్కజొన్న సీడ్ కంపెనీ మోసగించిందని
పోలీసులకు రైతుల ఫిర్యాదు
పరిహారం ఇప్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి - ముసునూరు

మొక్కజొన్న సీడ్ కంపెనీల మోసపూరిత మాటలు విని నష్టపోయేవారి రైతుల సంఖ్య రోజురోజుకు పెరుగుతూనే ఉంది. సీడ్ కంపెనీ ఆర్గనైజర్ తమను మోసం చేశారని, నష్టపోయామని, న్యాయం చేయాలని మండలంలోని చెక్కపల్లి గ్రామంలో రైతులు వేడుకుంటున్నారు. ఈ మేరకు ముసునూరు పోలీస్‌స్టేషన్‌లో రైతులందరూ కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధిత రైతులు మాట్లాడుతూ గతేడాది క్రిస్టల్ అనే మొక్కజొన్న సీడ్ కంపెనీ వారు తమ కంపెనీ సీడ్ వాడాలని, ఒక్కో టన్నుకు రూ.30 వేలు ఇస్తామని, ఎకరానికి మూడు నుంచి ఐదు టన్నులు దిగుబడి వస్తుందని చెప్పారని తెలిపారు. దీంతో సుమారు రెండు వందల ఎకరాల్లో సుమారు 60, 70 మంది కలిసి క్రిస్టల్ కంపెనీకి చెందిన సీడ్ సాగు చేశామని చెప్పారు. ఎకరానికి ఒకటిన్నర టన్నుల నుంచి రెండున్నర టన్నుల దిగుబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. దీనిపై తాము ఆ సీడ్ కంపెనీ ఆర్గనైజర్‌ను అడగగా ఎకరానికి రూ.70 వేల నుంచి రూ.80 వేల వరకు అందిస్తామని చెప్పి ఒప్పందం కుదుర్చుకుని తమ వద్ద ఉన్న మొక్కజొన్న గింజలను సీడ్ కంపెనీకి తరలించారన్నారు. అప్పటి నుంచి ఇప్పటివరకు ఇప్పటివరకు ఒక్క రూపాయి కూడా అందించలేదని, అడిగితే రేపు, మాపు అంటూ కాలం గడిపేస్తున్నారని, డబ్బులు మాత్రం ఇవ్వడంలేదని, తాము ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. తమకు న్యాయం చేయాలని, కంపెనీ నుంచి డబ్బులు ఇప్పించేలా చర్యలు తీసుకోవాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు. రైతుల ఫిర్యాదు మేరకు ఎస్ఐ ఎం.చిరంజీవి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

28వ తేదీలోపు లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

జిల్లా ఖజానా అధికారి టి.కృష్ణ

ప్రజాశక్తి - ఏలూరు

ఏలూరు జిల్లాలో సర్వీస్ పెన్షనర్లు, కుటుంబ పెన్షనర్లు అంతా 2025వ సంవత్సరానికి చెందిన వార్షిక ధ్రువీకరణపత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) ఈ నెల 28వ తేదీలోపు సమర్పించాలని జిల్లా ఖజానా, లెక్కల శాఖాధికారి టి.కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛనుదారులు తమ సమీపంలోని ఖజానా కార్యాలయం, మీసేవా కేంద్రాలు, బ్యాంకులు, ఇంటర్నెట్ సెంటర్లలో వారి వార్షిక ధ్రువీకరణ పత్రాలు (లైఫ్ సర్టిఫికెట్) నిర్దేశించిన గడువులోగా సమర్పించాలని కోరారు. ఈ విషయంలో ఏదైనా ఇబ్బందులుంటే పింఛనుదారులు సంబంధిత ఖజానా అధికారుల దృష్టికి తీసుకురావచ్చని సూచించారు.

సేవల రుసుము దుర్వినియోగం

కాకర్లమూడి డిజిటల్ అసిస్టెంట్‌కు మెమోలు

ప్రజాశక్తి - ఉంగుటూరు

మండలంలోని కాకర్లమూడి సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న వి.ప్రశాంత్‌కుమార్ పలు ఆర్థిక అవకతవకలు పాల్పడినట్లు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సచివాలయాల్లో ఎపి-సేవలు అందించేలా ప్రభుత్వం పోర్టల్ అందుబాటులో ఉంచింది. పౌరులు విద్యుత్, క్యాస్ట్, ఇన్‌కమ్, నీటి తీరువా తదితర బిల్లులు సచివాలయాల్లో డిజిటల్ అసిస్టెంట్ వద్ద డబ్బులు చెల్లించి రశీదుతో పాటు ధ్రువపత్రాలు పొందాల్సి ఉంది. ఇలా వచ్చిన అమౌంట్‌ను రోజు విడిచి రోజు ఎపి సేవ ఖాతాకు డిజిటల్ అసిస్టెంట్ జమ చేయాల్సి ఉంది. ఇక్కడే పలు అవకతవకలు చోటు చేసుకుంటున్నాయి. కాకర్లమూడి డిజిటల్ అసిస్టెంట్ ఎపి మీ సేవ ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వ ఖాతాకు జమ చేయకుండా సొంతానికి వాడుకున్నారు. ఈ విషయాన్ని ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయం అధికారులు గమనించి రెండు నెలల క్రితం రెండు మెమోలు ఇచ్చారు. దానికి స్పందించకపోవడంతో జిల్లా సిఇఒ కూడా మెమో ఇచ్చారు. సొమ్ము తిరిగి చెల్లించేంతవరకు అతన్ని తాత్కాలికంగా కాకర్లమూడి సచివాలయం విధుల నుంచి తప్పించి ఎంపిడిఒ కార్యాలయంలో డేటా ఎంట్రీ పనులు అప్పగించారు. సుమారు రూ.76 వేలు అవకతవకలు జరిగినట్లుగా చెబుతున్నారు.

ఉన్నతాధికారుల ఆదేశాలతో మెమో ఇచ్చాం
ఎంపిడిఒ జి.రాజ్‌మనోజ్

కాకర్లమూడి డిజిటల్ అసిస్టెంట్ ఎపి మీసేవ ద్వారా వచ్చిన సొమ్మును ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వాడుకున్నట్లు గుర్తించాం. ఆ మేరకు రెండు పర్యాయాలు మెమో ఇచ్చాం. అనంతరం జిల్లా ఉన్నతాధికారులకు కూడా సమాచారం అందించాం. జెడ్‌పి సిఇఒ కూడా మెమో ఇచ్చారు. ఇంకా రూ.76 కట్టాల్సి ఉంది.

పెండింగ్ కేసులపై దృష్టి పెట్టాలి

పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు
జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌లో నేర సమీక్ష

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

సబ్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసులపై దృష్టి పెట్టాలని పోలవరం డిఎస్‌పి ఎం.వెంకటేశ్వరరావు సిబ్బందిని ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సబ్ డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఆయా స్టేషన్ల పరిధిలో పలు కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. గడిచిన ఆరు నెలల కాలంలో సబ్ డివిజన్ పరిధిలో జరిగిన నేరాల వివరాలను ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరాల నియంత్రణను తగ్గించే విధంగా సిబ్బంది కృషి చేయాలని కోరారు. ఆయా పోలీస్‌స్టేషన్ల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్న వారిపై దృష్టి సారించాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీలుగుమిల్లి సిఐ బి.వెంకటేశ్వరరావు, పోలవరం సిఐ బాలసురేష్, కుక్కునూరు సిఐ ఎం.రమేష్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.


నేర సమీక్ష చేస్తున్న డిఎస్‌పి వెంకటేశ్వరరావు

సేవ చేయడమే కెఎల్ యూనివర్సిటీ లక్ష్యం

డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జె.శ్రీనివాసరావు
ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులకు అవగాహనా సదస్సు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

ఇంటర్మీడియట్ పూర్తయిన తర్వాత విద్యార్థులు ఎటువంటి కోర్సులు తీసుకోవాలో తెలియజేయడానికి అవగాహనా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని కెఎల్ యూనివర్సిటీ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ జె.శ్రీనివాసరావు అన్నారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో కెఎల్ యూనివర్సిటీ వారు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కొంతమంది విద్యార్థులకు ఉచిత విద్యను అందించే భరోసాను కల్పించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇంటర్మీడియట్ అయిపోయిన విద్యార్థులు ఎటువంటి కాలేజీని ఎంపిక చేసుకోవాలో, ఎటువంటి గ్రూపును ఎంచుకోవాలో వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. విద్యార్థులకు కోర్సుల గురించి, కాలేజీల గురించి, ఇఎపిసెట్‌లో ఎన్ని మార్కులు వస్తే ఏ సీటు వస్తుందో, ఏ కాలేజీ వస్తుందో, ఎటువంటి విద్యావకాశాలు ఉన్నాయో, స్కాలర్‌షిప్పులు ఏ విధంగా వస్తాయో విద్యార్థులకు వివరించామని తెలిపారు. ఇంకో 50 ఏళ్లపైనే కెఎల్ యూనివర్సిటీ మంచి మంచి పిల్లలను ప్రపంచానికి అందించే బాధ్యత తీసుకుందని తెలిపారు. ప్రపంచానికి, దేశానికి సేవ చేయడమే కెఎల్ యూనివర్సిటీ లక్ష్యమని తెలిపారు.



అవగాహనా సదస్సులో మాట్లాడుతున్న ప్రముఖులు


ప్రచారంలో సిఐటియు, గిరిజన సంఘం నేతలు

పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలి

ప్రచారంలో ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లా పిడిఎఫ్ అభ్యర్థి కెఎస్.లక్ష్మణరావును గెలిపించాలని కోరుతూ మండలంలోని పల్లెర్లమూడి, తుక్కులూరు, సీతారాంపురం, మీర్జాపురం, మర్రిబంధం, గొల్లపల్లి, మోర్సపూడి గ్రామాల్లో ప్రజా సంఘాల నాయకులు శుక్రవారం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ 14 ఏళ్ల పాటు ఎంఎల్‌సిగా పని చేసిన కెఎస్.లక్ష్మణరావుకు సుదీర్ఘ అనుభవం ఉందన్నారు. అన్ని తరగతుల సమస్యలపై ఆయనకు స్పష్టమైన అవగాహన ఉందన్నారు. గతంలో కోట్ల రూపాయల విలువైన స్థలాలను ప్రజాప్రతినిధులకు ఇస్తామని చెప్పినా లక్ష్మణరావుతో సహ పిడిఎఫ్ ఎంఎల్‌సిలు వాటిని తిరస్కరించారని, ఆ స్థలాలను పేదలకు ఇవ్వమన్నారని చెప్పారు. ఉద్యోగులు, టీచర్, అధ్యాపకులు, రైతులు, నిరుద్యోగులు, యువత పోరాటాలకు అనేక ఏళ్లుగా ఆయన అండగా ఉన్నారన్నారు. సమస్యలను సమర్థవంతంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లగలరన్నారు. శాసనమండలి సమావేశాలకు క్రమం తప్పకుండా ప్రతిరోజు హాజరై అక్కడ సమస్యలను ప్రస్తావిస్తారన్నారు. తొలి ప్రాధాన్యత ఓటును కెఎస్.లక్ష్మణరావుకు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కె.సామేలు, పి.బోసు, ఆర్.ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.


ప్రచారంలో ప్రజాసంఘాల నాయకులు

ఎంఎల్‌సి ఎన్నికల్లో రాఘవులును గెలిపించాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యాన ప్రచారం

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

ఎంఎల్‌సి పిడిఎఫ్ అభ్యర్థి దిడ్ల వీర రాఘవులుకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. మండలంలోని బుసరాజుపల్లి గురుకుల పాఠశాల, కళాశాల, పాలకుంట గురుకుల పాఠశాల, అంతర్వేదిగూడెం గురుకుల పాఠశాలల్లోని ఉపాధ్యాయులను, గ్రాడ్యుయేట్‌లను కలిసి కరపత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు మొడియం నాగమణి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు తెల్లం రామకృష్ణ, గిరిజన సంఘం మండలాధ్యక్షుడు పోలోజు నాగేశ్వరరావు, తామా ముత్యాలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రైతులందరూ విశిష్ట గుర్తింపు సంఖ్య పొందాలి

జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్ భాషా

ప్రజాశక్తి - ముదినేపల్లి

కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దేశంలో ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు నెంబర్ అందించేందుకు ఫార్మర్స్ రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ భాషా తెలిపారు. మండలంలోని అప్పారావుపేట రైతు సేవ కేంద్రాన్ని శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తమ ఆధార్ కార్డు, భూమి పాస్ పుస్తకం లేదా 1బి, ఆధార్ లింక్ చేసిన ఫోన్ నెంబర్ గల ఫోన్‌తో దగ్గరలోని రైతు సేవా కేంద్రంలో వ్యవసాయ, ఉద్యాన సహాయకులను సంప్రదించి తప్పక ప్రత్యేక గుర్తింపు నెంబర్ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండలి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.వెంకటమణి, ముదినేపల్లి మండల వ్యవసాయాధికారి బి.వేణుమాధవ్, రైతులు పాల్గొన్నారు.

చింతలపూడి: ప్రభుత్వ పథకాలు, రాయితీలు, ఇతర వ్యవసాయ సంబంధిత సేవలను పొందడానికి గుర్తింపు సంఖ్య అధికారిక గుర్తింపుగా పని చేస్తుందని మండల వ్యవసాయాధికారి మీనాకుమారి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్రంలోని భూమి గల ప్రతి రైతుకు ఒక ప్రత్యేక గుర్తింపు సంఖ్యను ఇవ్వడం ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా మరింత అందుబాటులోకి తీసుకురావచ్చన్నారు. ప్రభుత్వం అందించే పథకాలు నిరవధికంగా పొందేందుకు ఈ సంఖ్య ఉపయోగపడుతుందని తెలిపారు.

వణుదుర్రులో ఆక్వా చెరువుల అక్రమ తవ్వకాలు

పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం

వ్యకాస మండల కార్యదర్శి చిన్నం మాధవ

ప్రజాశక్తి - ముదినేపల్లి



అనుమతి లేకుండా తవ్విన ఆక్వా చెరువు

రెండు పంటలు పండే వచ్చని పంట పొలాలను బడా బాబులు ఆక్వా చెరువులుగా మార్చుస్తున్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టారాజ్యంగా పంట పొలాలను ఆక్వా చెరువులుగా తవ్వుతూ మట్టిని టిప్పర్లతో బయటకు తరలిస్తూ అమ్ముకుంటూ రూ.లక్షలు గడిస్తున్నారు. ఈ తంతు అంతా మండలంలోని వణుదుర్రులో జరుగుతుంది. కొన్నిరోజులుగా గ్రామ సమీపంలో అనుమతులు లేకుండా రెండు పంటలు పండే పంటపొలాలను ఆక్వా చెరువులుగా మారుస్తున్నట్లు గ్రామానికి చెందిన వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి చిన్నం మాధవ తెలిపారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు ఈ తవ్వకాలు చేస్తున్నారన్నారు. గతంలో కూడా దళితవాడ సమీపంలో పలు సార్లు అనుమతులు లేని చెరువుల అక్రమ తవ్వకాలు చేయడంతో జిల్లాస్థాయి అధికారులకు ఫిర్యాదు చేయడంతో నిలిపివేసినట్టు చెప్పారు. గ్రామంలో కొన్ని రోజులుగా అక్రమార్కులు రేయి పగలు అనే తేడా లేకుండా చెరువులు తవ్వుతూ మట్టిని టిప్పర్లతో ఇతర ప్రాంతంలోకి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారన్నారు. ఈ విషయం తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లినా ఆయన స్పందించడం లేదన్నారు. ఆదివారం వ్యవసాయం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటనే చెరువుల అక్రమ తవ్వకాలను, మట్టి తోలకాలను నిలుపుదల చేయాలని, లేకుంటే సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని తెలిపారు.

బి పోషణ్, బి పడాయిపై శిక్షణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

ప్రారంభ విద్య బిడ్డ భవిష్యత్తుకు పునాది వంటిదని ఐసిడిఎస్ సూపర్‌వైజర్ ఎం.లక్ష్మి తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బి పోషణ్, బి పడాయిపై శుక్రవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ముద్రిపాలు బిడ్డకు సంజీవని వంటివన్నారు. మూడు రోజులు నిర్వహించే శిక్షణకార్యక్రమంలో 66 మంది అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నట్లు ఆమె తెలిపారు.

బుట్టాయగూడెం : స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండలంలోని 90 మంది అంగన్వాడీ టీచర్లకు రెండో రోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. సిడిపిఒ తులసి పాల్గొని మాట్లాడుతూ పోషణతో పాటు విద్యకు ప్రాధాన్యతను తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రూన్సీ, అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ఉంగుటూరు : అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను మరింత సమర్థవంతంగా అందించేందుకు, ఆధునీకరించిన సేవల పట్ల అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న పోషణ్ బి పఠాన్ బి శిక్షణ తరగతుల సేవలను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని ఐసిడిఎస్ భీమడోలు ప్రాజెక్టు బాదంపూడి, చేబ్రోలు సెక్టార్ సూపర్‌వైజర్లు బి.వి.శ్రీలక్ష్మి, శారదమణి కోరారు. భీమడోలు ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో ఉంగుటూరు మండలంలోని చెందిన 84 మంది అంగన్వాడీ కార్యకర్తలకు గొల్లగూడెం, రాచూరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో మూడు రోజులపాటు కొనసాగే శిక్షణ తరగతుల్లో భాగంగా రెండో రోజు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రిసోర్స్‌పర్సన్లుగా సూపర్‌వైజర్లు బి.వి.శ్రీలక్ష్మి శారద మణిలు వ్యవహరించారు. శిక్షణ తరగతుల్లో అంగన్వాడీ కార్యకర్తలకు ప్రారంభ ప్రేరణ, ప్రారంభ బాల్య సంరక్షణ విద్య, పాఠ్యాంశాల బోధనా విధానాలు, కార్యకర్తలకు సరిక అంశాల పట్ల అవగాహన కల్పించారు. సామర్థ్యాలను అభివృద్ధి చేయడం, సంఖ్యాశాస్త్రం ఇతర అంశాల గురించి వివరించడం, అమలు కానున్న పోషణ్ -2, చిన్నారుల ఆహార పద్ధతులు, పోషకాహార విలువల పట్ల అవగాహన కల్పించడం వంటి అంశాల్లో తర్ఫీదు ఇచ్చారు.

ఎంఎల్‌ఎపై దుష్ప్రచారం చేస్తున్న

ఛానల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

పోలీసులకు జనసైనికుల ఫిర్యాదు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజుపై దుష్ప్రచారం చేస్తున్న ఓ యూట్యూబ్ ఛానల్, పేపర్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని పలువురు జనసైనికులు జీలుగుమిల్లి పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని సిఐ వెంకటేశ్వరావు, ఎస్ఐ నవీన్‌కుమార్‌లకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్న ఎంఎల్ఎ బాలరాజుపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న ఓ పేపర్, యూట్యూబ్ ఛానల్‌లో ప్రచారం చేసిన యాజమాన్యంపై తక్షణమే చర్యలు తీసుకోవాలని పోలీసువారిని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కరాటం సాయి, జి.రవి, నాలి శ్రీను, పి.రాము, టి.సాంబ, సతీష్‌రెడ్డి, నాగరాజు, పలువురు జనసైనికులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు సమగ్ర రక్షణ చట్టం చేయాలి

ప్రజాశక్తి - చింతలపూడి

కౌలు రైతులకు సమగ్ర రక్షణ చట్టం ఏర్పాటు చేయాలని సిపిఐ సీనియర్ నాయకులు మామిళ్ళపల్లి వసంతరావు కోరారు. మండలంలోని మల్లాయగూడెంలో కౌలు రైతు సంఘం సమావేశం తక్కెళ్లపాటి ప్రసాదరావు అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వసంతరావు మాట్లాడుతూ దేశంలో 70 శాతం వ్యవసాయం కౌలు రైతుల ఆధ్వర్యంలోనే నడుస్తున్నదన్నారు. కానీ కౌలు రైతులను రాష్ట్ర ప్రభుత్వం చిన్న చూపు చూస్తుందన్నారు. అనంతరం బడుగుల సభ్యులతో కమిటీని ఏర్పాటు చేశారు. కౌలు రైతు సంఘం గ్రామ శాఖ అధ్యక్షులుగా నల్లి రామచంద్రరావు, కార్యదర్శిగా చీకటి సత్యనారాయణ, కమిటీ సభ్యులుగా చీకటి సూరయ్య, టంగుటూరి రాంబాబు, తక్కలపాటి లక్ష్మయ్య, చీకట సత్యనారాయణను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి దొంత కృష్ణ, రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాయాంకుల లక్ష్మణరావు, సిపిఐ మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య, సహాయ కార్యదర్శి తొర్లపాటి బాబు, రైతు సంఘం నాయకులు తాడిగడప మాణిక్యాలరావు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

400 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని దేవరగుంట గ్రామంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులు శుక్రవారం దాడి చేశారు. ఈ దాడిలో 400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సిఐ ఎ.మస్తానయ్య తెలిపారు. నాటుసారా స్థావరం నుంచి పారిపోయిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో నూజివీడు ప్రొహిబిషన్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్ వై.ఈశ్వరరావు, ఎం.ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి

ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190

పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

పుల్వామా దాడిలో అమరులకు నివాళులు

ప్రజాశక్తి - చింతలపూడి

స్థానిక చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పుల్వామా దాడిని స్మరించుకున్నారు. కళాశాల ప్రిన్సిపల్ పి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి, లెక్చరర్ జి.జీవన్‌మౌళిక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పుల్వామా దాడి గురించి విద్యార్థులకు వివరించారు. ఈ దాడిలో అమరులైన 40 మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లకు కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. ఇలాంటి దాడుల వల్ల జరిగే నష్టాల గురించి స్పష్టంగా వివరించారు. వివరిగా మౌనం పాటించడం ద్వారా ఈ కార్యక్రమాన్ని ముగించారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ విభాగ అధ్యాపకులు సురేష్, విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించేలా కృషి చేస్తున్నామని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. నూజివీడు మంత్రి క్యాంపు కార్యాలయంలో పట్టభద్రుల ఎన్నికల సందర్భంగా నియోజకవర్గ కూటమి నాయకులు, బూత్, క్లస్టర్, యూనిట్, కమిటీ నాయకులతో ఎన్నికల ప్రక్రియపై శుక్రవారం మంత్రి అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యావేత్త, విద్యాదాత రాజేంద్రప్రసాద్‌ను గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని ఆర్థిక నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్రాన్ని ఆర్థికంగా గాడిలో పెట్టడానికి విద్యావంతులు, మేధావులను చట్ట సభల్లోకి పంపాలన్నారు. ఈ కార్యక్రమంలో అబ్జర్వర్ మల్లెల రాజశేఖర్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ దుర్గాప్రసాద్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పి.సత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షులు జగదీష్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రహదారి నియమ నిబంధనలు పాటించాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని రవాణా శాఖ ఆధ్వర్యంలో ఆటో యూనియన్ డ్రైవర్లు, యజమానులు, మాక్సీ క్యాబ్ డ్రైవర్లు, యజమానులు, సహాయకులను లక్ష్యంగా చేసుకుని రహదారి భద్రత అవగాహనా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాంతీయ రవాణా శాఖాధికారి జి.నాగమురళి మాట్లాడుతూ ప్రతిఒక్కరూ మోటార్ వెహికల్స్ నియమ నిబంధనలు పాటించాలన్నారు. పరిమితికి మించి ప్యాసింజర్లను ఎక్కించుకోవద్దని డ్రైవర్లకు సూచించారు. అనంతరం రవాణా శాఖాధికారులు కృష్ణవేణి, అన్నపూర్ణ, ఆటో యూనియన్ డ్రైవర్లు, యజమానులు, మాక్సీ క్యాబ్ డ్రైవర్లు, యజమానులు, సహాయకులు పాల్గొన్నారు. వీరికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నూజివీడు రవాణా శాఖ అధికారులు, ఆర్‌టిసి డిఎం పవన్‌కుమార్, ఆటో యూనియన్ డ్రైవర్లు, యజమానులు, మాక్సీ క్యాబ్ డ్రైవర్లు, యజమానులు, సహాయకుల పాల్గొన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్తు ఇంధన ప్రత్యామ్నాయంపై సదస్సు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆర్‌జియుకెటి నూజివీడులో గ్రీన్ హైడ్రోజన్ భవిష్యత్తు ఇంధన ప్రత్యామ్నాయంపై సదస్సును నిర్వహించారు. ప్రముఖ శాస్త్రవేత్త, ప్రొఫెసర్ జి.భగవాన్ నారాయణ రిసోర్స్‌పర్సన్‌గా ఆర్‌జియుకెటి నూజివీడుకు వచ్చారు. సదస్సులో భాగంగా పునరుత్పాదక శక్తి వనరుల ఆధారంగా ఉత్పత్తి అయ్యే గ్రీన్ హైడ్రోజన్ శుద్ధత, వినియోగ అవకాశాలు, పర్యావరణ పరిరక్షణలో దాని పాత్రను వివరించారు. ఈ సదస్సులో ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గ్రీన్ హైడ్రోజన్‌పై దృష్టి పెట్టాయని, విద్యార్థులు కూడా దానికి అనుగుణంగా అవసరమైన స్కిల్స్ నేర్చుకుని తదితర రంగాల్లో నైపుణ్యాలు పెంచుకుని ఉద్యోగాలు సాధించాలని చెప్పారు. డీన్ అకాడమిక్స్ డాక్టర్ చిరంజీవి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గ్రీన్ హైడ్రోజన్ మిషన్ 2021 గురించి వివరించారు. సెమినార్ కన్వీనర్ డాక్టర్ దుర్గాబాబు మాట్లాడుతూ ఈ కార్యక్రమం శాస్త్రీయ పరిశోధన, సాంకేతిక అభివృద్ధి దిశకు ఒక ప్రేరణగా నిలిచిందని, భవిష్యత్తు శక్తి మార్గదర్శకంలో గ్రీన్ హైడ్రోజన్ కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ సెమినార్‌లో అసోసియేటీ అకాడమిక్స్ కె.రఘుకుమార్, డిఎస్‌డబ్ల్యూ ఎ.బ్రహ్మస్వాములు పాల్గొన్నారు.

హెపటైటిస్ వ్యాధిపై అవగాహన అవసరం


ప్రజాశక్తి - భీమడోలు

ట్రాన్స్ జెండర్లు, హైరిస్క్ గ్రూపులకు చెందినవారు హెపిటైటిస్ వ్యాధి పట్ల అవగాహన కలిగి ఉండాలని భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు డాక్టర్ ఎన్.సునీత కోరారు. సామాజిక ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగం ఆధ్వర్యంలో హైరిస్క్ గ్రూపులకు చెందిన వారికి ఆరోగ్య పరిరక్షణ కోసం హెపిటైటిస్ వ్యాధి పట్ల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. వారికి హెపిటైటిస్ బి, సి వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని సామాజిక ఆరోగ్య కేంద్రం పర్యవేక్షకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా పర్యవేక్షకులు మాట్లాడుతూ నిర్ణీత కాల వ్యవధిలో భీమడోలులో ఉన్న లింక్ ఎఆర్‌టి కేంద్రం ద్వారా వ్యాక్సిన్ వేసే కార్యక్రమం కొనసాగుతుందని, సేవలను వినియోగించుకోవాలని కోరారు. గుర్తింపు పొందిన 36 మంది హైరిస్క్ బాధితులకు వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని పూర్తి చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ విభాగానికి చెందిన అధికారులు హరనాథ్‌రావు, శైలజ, భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రానికి చెందిన కౌన్సిలర్ సింహాద్రి, ల్యాబ్ టెక్నీషియన్ బి.పాపారావు పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటి విద్యార్థినికి ఆర్థిక సాయం

బ్రెయిన్ హేమరేజ్‌తో చికిత్స పొందుతున్న అనూష

ప్రజాశక్తి - నూజివీడు టౌన్



ఆర్థిక సాయం అందిస్తున్న యాజమాన్యం, విద్యార్థులు

నూజివీడు ఆర్‌జియుకెటిలో బిటెక్ మొదటి సంవత్సరం విద్యార్థిని ఎం.అనూష గతేడాది డిసెంబర్ 19న బ్రెయిన్ హేమరేజ్ కారణంగా చికిత్స నిమిత్తం విజయవాడ మణిపాల్ హాస్పిటల్‌లో చేరింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన పేదింటి కుటుంబం నుంచి వచ్చిన అనూషకు అత్యవసర పరిస్థితుల్లో కాలేజీ యాజమాన్యం రూ.2.50 లక్షలు, విద్యార్థులు హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ ద్వారా రూ.2.30 లక్షల సాయం అందించారు. అనూష వైద్యం అత్యంత ఖరీదైనది కావడంతో ట్రిపుల్ ఐటి విద్యార్థులు ఈ విషయం ఎక్స్ ద్వారా రాష్ట్ర మంత్రి లోకేష్‌కు తెలిపి సహాయం అభ్యర్థించగా ఆయన స్పందించి సిఎం చంద్రబాబు దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. సిఎం రూ.12 లక్షలు సిఎం సహాయ నిధి నుంచి మంజూరు చేశారు. తరువాత సదరు విద్యార్థినిని శ్రీకాకుళంలోని ధరణి హాస్పిటల్లో వెంటిలేషన్‌పైన ఉంచి చికిత్స అందిస్తున్నారు. వైద్యం నిమిత్తం, కుటుంబ ఆర్థిక పరిస్థితిని గమనించిన విద్యార్థుల సంస్థ హెల్పింగ్ హ్యాండ్స్ రూ.1.20 లక్షలు సహాయం చేయటానికి ముందుకొచ్చింది. ఆర్‌జియుకెటి డైరెక్టర్ అమరేంద్రకుమార్, హెల్పింగ్ హాండ్స్ ప్రెసిడెంట్ బ్రహ్మస్వాములు, డిఎస్‌డబ్ల్యూ డాక్టర్ దుర్గాభవాని, చీఫ్ వార్డెన్ డాక్టర్ లక్ష్మణ్‌రావు, యోగా శిక్షకుడు అక్కినేని సత్య శ్రీధర్, పిఆర్‌ఒ డాక్టర్ రాజేష్ చేతులమీదుగా రూ.1.20 లక్షల చెక్కును అనూష తండ్రి ధనుంజయ్‌కి శుక్రవారం అందించారు. హెల్పింగ్ హ్యాండ్స్ మొత్తంగా రూ.3.50 లక్షలు విరాళంగా అందించి తమ మానవత్వాన్ని చాటుకుంది. ఈ సందర్భంగా తల్లితండ్రులు సిఎంకు, మంత్రి లోకేష్‌కు వారి బృందానికి, విద్యార్థులకు, యాజమాన్యానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

కుంగిన రహదారితో అవస్థలు

ప్రమాదాల బారిన వాహనదారులు

పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - ముదినేపల్లి



కోమరు అడ్డరోడ్డు సమీపంలో కుంగిన రహదారి

కుంగిన రహదారితో వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏమాత్రం వాహనచోదకులు నిర్లక్ష్యంగా ఉన్నా ఈ రోడ్డులో ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొంది. ముదినేపల్లి-బంటుమిల్లి ఆర్అండ్‌బి రహదారిలో కోమర్రు అడ్డరోడ్డు సమీపంలో రోడ్డు కుంగింది. ఇక్కడ రోడ్డు ఎత్తు పల్లాలుగా ఉండి ఒక వైపు కుంగిపోయింది. కుంగిన రోడ్డు కారణంగా ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వాహనదారులు ఈ చోట ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. ముఖ్యంగా రాత్రి సమయాల్లో ద్విచక్ర వాహనదారులు ఈ ప్రాంతంలో తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. రోడ్డు కుంగి ఎత్తు పల్లాలుగా ఉన్నచోట లైట్లు లేకపోవడం, ఎదురుగా వచ్చే పెద్ద వాహనాల వెలుతురు ద్విచక్ర వాహనదారుల కళ్లల్లో పడడంతో రోడ్డు కుంగిన చోట వాహనదారులు, సైకిల్‌పై రాత్రివేళ ప్రయాణం చేసేవారు రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇక్కడ రోడ్డు కుంగి ఎంతో కాలమవుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో ఈ రహదారిపై ప్రయాణించే కొత్తవారు రోడ్డు కుంగిన చోట ప్రమాదాల బారిన పడుతూ క్షతగాత్రులుగా మారుతున్నారు. విజయవాడ- భీమవరం ప్రధాన రహదారి కావడంతో నిత్యం ఈ రహదారిపై వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం ఈ రహదారి రద్దీగా ఉంటుంది. ఎప్పటికైనా సంబంధిత శాఖాధికారులు స్పందించి కుంగిన రోడ్డుకు మరమ్మతులు చేసి వాహనదారులు ప్రమాదాల బారిన పడకుండా చూడాలని సంబంధిత శాఖాధికారులను వాహనచోదకులు ముక్తకంఠంతో కోరుతున్నారు.

21, 22 తేదీల్లో సబ్‌జోన్ ఆటల పోటీలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సబ్ జోన్ ఆటల పోటీలు ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్నారు. నూజివీడు నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల సర్వసభ్య సమావేశం నూజివీడు ఉపవిద్యా శాఖాదికారి సేవియా అధ్యక్షతన ఆయన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపవిద్యాశాఖాధికారి మాట్లాడుతూ జిల్లా విద్యా శాఖాదికారి ఆదేశాల మేరకు సబ్ జోన్ ఆటల పోటీలు ఆగిరిపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించినట్లు తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదో తరగతి విద్యార్థులకు ఒకే కేటగిరిలో పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ప్రతి స్కూల్ నుంచి క్రీడలు విభాగంలో ఈవెంట్‌కు ఇద్దరు క్రీడాకారులు పాల్గొనవచ్చున్నారు. వాలీబాల్, త్రోబాల్, కబడ్డీ, ఖోఖో, వంద మీటర్ల 200 మీటర్ల, 400 మీటర్ల పరుగుపందెం, బ్రాడ్ జెంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో పోటీలు నిర్వహించనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం నూజివీడు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పి.రవీంద్ర తెలిపారు. ఆగిరిపల్లి మండల ఇన్‌ఛార్జి శివ నాగేంద్రం మాట్లాడుతూ ఆటల పోటీలు తమ స్కూల్‌కు కేటాయించడం గర్వకారణమని తెలిపారు. ఆటల పోటీల బహుమతులన్నీ తానే వ్యక్తిగతంగా ఇస్తానని తెలిపారు. ఒక పద్ధతి ప్రణాళికతో అందరి సహాయ సహకారాలతో నిర్వహిస్తామని తెలిపారు. సబ్ జోన్ సెక్రటరీ సుగుణరావు మాట్లాడుతూ పోటీలు మొదటి రోజు బాలురుకు, రెండోరోజు బాలికలకు నిర్వహిస్తామని తెలిపారు. పాల్గొనే క్రీడాకారులు ఏస్కూల్ నుంచి ఎంతమందో రెండు రోజుల ముందు తెలియజేయాలని కోరారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు మాట్లాడుతూ అందరి సమిష్టి కృషితో విజయవంతం చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు శివనాగేంద్రం, సుగుణరావు, లక్ష్మి, అన్నామణి, వనజ, నాగరాజు, సతీష్, ఆలీఖాన్, సుకుమార్, నాగేశ్వరరావు, హర్ష, రాణి, ఉమా మహేశ్వరి, స్వప్న, నాగమణి, ప్రమీల సుధాకర్, రాజేంద్ర ప్రసాద్, ప్రభాకర్, హేమ పాల్గొన్నారు.

గీతాంజలి విద్యాసంస్థల్లో జాబ్ మేళా



తెగుచిని అభినందిస్తున్న ఎంఎల్ఎ, కరస్పాండెంట్

ప్రజాశక్తి - భీమడోలు

స్థానికంగా సాంకేతిక విద్యను అభ్యసించిన నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు బహుళ జాతి సంస్థ లిక్సిల్ ముందుకు రావడం అభినందనీయమని, దీనికి వేదికగా నిలిచిన నిరుద్యోగ యువతను చైతన్య పరిచిన భీమడోలు గీతాంజలి విద్యాసంస్థల యాజమాన్యం చేసిన కృషి ప్రశంసనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. రూ.వందల కోట్ల వ్యయంతో అంబరుపేట గ్రామంలో జపాన్ దేశానికి చెందిన బహుళ జాతి సంస్థ లిక్సిల్ శానిటరీ వేర్ ఉత్పత్తుల తయారీ సంస్థను ఏర్పాటు చేసింది. విస్తరిస్తున్న సంస్థ అవసరాల రీత్యా ఖాళీల భర్తీకి భీమడోలు గీతాంజలి విద్యాసంస్థలు వేదికగా శుక్రవారం సాంకేతిక విద్య అర్హత కలిగిన నిరుద్యోగ యువతతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించింది. దీనికి ఐటిఐ, డిప్లమా, ఇంజినీరింగ్ విద్యార్హత గల 300 మంది యువత హాజరయ్యారు. ఎన్నికైన వారికి స్థానికంగా అప్రెంటిస్ ట్రైనింగ్ ఇచ్చి ఆ తరువాత శాశ్వత ప్రాతిపదికన ఉద్యోగులుగా తీసుకుంటామని సంస్థ హామీ ఇచ్చింది. ఈ కార్యక్రమంలో టిడిపి ఏలూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, జనసేన నాయకులు వట్టి పవన్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. లిక్సిల్ సంస్థ తరపున ప్లాంట్ లీడర్ తెగుచితో పాటు ఆపరేషన్స్ డైరెక్టర్ బాల కుమార్, బిపి.లోకేష్ పాల్గొన్నారు. వీరికి గీతాంజలి విద్యాసంస్థల ప్రతినిధులు ఎం.ఉదయ్‌కిరణ్, స్కిన్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ప్రవీణ్‌కృష్ణ ఇతరులు సహకారం అందించారు. ప్లాంట్ లీడర్ తెగుచి, గీతాంజలి విద్యాసంస్థల కరస్పాండెంట్ ఎం.గౌతమ్‌కుమార్ మాట్లాడారు.

తిరివీధి లక్ష్మీ రామారావు సేవా ట్రస్ట్ సేవలు అభినందనీయం

డివైఇఒ సేవ్యానాయక్

పలు గ్రామాల్లో ఉచిత వైద్య శిబిరాలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని గొల్లపల్లి, మీర్జాపురం గ్రామాల్లో తిరివీధి లక్ష్మీరామారావు సేవా ట్రస్ట్, ఎన్ఎస్ హాస్పిటల్స్ సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్ర, జనరల్ మెడికల్ క్యాంపులు నిర్వహించారు. నేత్ర వైద్య నిపుణులు జమ్ రుద్ షాహిన్, అత్యవసర విభాగ వైద్యులు ఎస్‌కె.నాయబ్‌రసూల్‌లు ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డివైఇఒ సేవ్యానాయక్ మాట్లాడుతూ పేదలు నివసించే ప్రాంతాల్లో సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్య విబిరాలు నిర్వహించడంతో పాటు ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయించుకున్నవారికి రాయితీపై శస్త్ర చికిత్సలు అనుభవజ్ఞులైన వైద్యులతో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇలాంటి సేవలను అందిస్తున్న సేవా ట్రస్ట్ నిర్వాహకులు తిరివీధి కృష్ణ చేస్తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమన్నారు.

దామోదరం సంజీవయ్య జీవితం స్ఫూర్తిదాయకం

ఘనంగా జయంతి వేడుకలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్రంలో పేద ప్రజలందరికీ ఆరు లక్షల ఎకరాల భూమిని పంపిణీ చేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్యదే అని ఎస్‌సిఆర్‌పిఎస్ జనరల్ సెక్రటరీ మొండెం సంతోష్ కుమార్ అన్నారు. ఏలూరులోని ఇండోర్ స్టేడియం వద్ద ఉన్న లేడీస్ లయన్స్ క్లబ్‌లో దామోదరం సంజీవయ్య 104వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంతోష్ కుమార్ మాట్లాడుతూ జాతిరత్న దామోదరం సంజీవయ్య రాష్ట్రంలో మొట్టమొదటిసారిగా అర్హులైన ప్రతి ఒక్కరికీ వృద్ధాప్య పింఛను అందించిన గొప్ప ఆలోచన పరుడన్నారు. ఈ కార్యక్రమంలో దళిత జెఎసి సభ్యులు నుకపేయి కార్తీక్, కనికర్ల మురళి పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కళాశాల పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ గుత్తా గిరిబాబు మాట్లాడుతూ అత్యంత పేదరికం నుంచి అత్యున్నత స్థితికి చేరిన దామోదరం సంజీవయ్య జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రాంబాబు, పొలిటికల్ సైన్స్ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు టి.వెంకట దుర్గాప్రసాద్, వివిధ విభాగాల అధ్యాపకులు ఎస్.పరమేశ, డాక్టర్ పి.విజయకుమార్, డాక్టర్ పిఆర్.కావ్యశ్రీ, ఎస్.సుస్వలత, డి.సుజాత పాల్గొన్నారు.

ముదినేపల్లి : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ తొలి మాల ముఖ్యమంత్రి దామోదర సంజీవయ్య, మాత బీమా భాయ్ అంబేద్కర్ జయంతి వేడుకలు శుక్రవారం ముదినేపల్లిలో నిర్వహించారు. రాష్ట్ర మాల మహానాడు అనుబంధ సంఘాల అధ్యక్షులు సేవ నాగ జగన్ బాబూరావు ఆధ్వర్యంలో ముదినేపల్లిలోని మాల మహానాడు కార్యాలయంలో దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గరికిముక్కు రాజేష్, దాకరపు జోజిబాబు, భూపతి అశోక్, పల్లెం రాజు, దాసరి మణి, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : సంజీవయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఎన్నో కార్మిక చట్టాలు అమలు చేశారని టిడిపి నగర పంచాయతీ ప్రధాన కార్యదర్శి బోడా నాగభూషణం, రాజీవ్ థామస్ ఛారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ డాక్టర్ మారుమూడి థామస్ అన్నారు. దామోదరం సంజీవయ్య 104వ జయంతి సందర్భంగా చింతలపూడి నగర పంచాయతీలో ఆయన చిత్రపటానికి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఐటిడిపి చింతలపూడి నియోజకవర్గ అధ్యక్షులు బోడ అనీష్‌కుమార్, దళిత నాయకులు కలకుర్తి నాగేశ్వరరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బిసి నాయకులు నరం లెనిన్, నర్సింగ రామారావు, అక్షర రిపోర్టర్ కృపావరం, కందికొండ రాజు, బోడ సాగర్ పాల్గొన్నారు.

బుట్టాయగూడెం : కెఆర్.పురం ఐటిడిఎ కార్యాలయంలో దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పిఒ కె.రాములునాయక్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఎ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాక్యుమెంట్ పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పెనుగొండ మండలం, పెనుగొండ గ్రామం, చెరుకువాడ కి చెందిన రాపాక మురళి, తండ్రి: వెంకటేశ్వర్లు అను నేను నా యొక్క డాక్యుమెంట్ పడిపోయింది. జిరాక్స్ సెంటర్ నుండి ఇంటికి వెళుతుండగా నా యొక్క డాక్యుమెంట్ పడిపోయింది. నా యొక్క **డాక్యుమెంట్ నెం. 3752/2017** గల డాక్యుమెంట్ ఎవరికైనా దొరికిన ఎడల ఈ క్రింది అడ్రస్ కు తెలియజేయగలరు.

రాపాక మురళి
తండ్రి : వెంకటేశ్వర్లు
డోర్ నెం : 33-26
చెరుకువాడ, పెనుగొండ,
పెనుగొండ మండలం, ప.గో.జిల్లా
సెల్: 90569 576613

పాస్‌పోర్టు పోయినది

పోడూరు మండలం, మట్టపర్రు గ్రామం, డోర్ నెం. 5-21, పెదపాలెం, మట్టపర్రు గ్రామం, ప.గో.జిల్లా, ఎ.పి కి చెందిన పెచ్చెట్టి శివబాబు, తండ్రి: వెంకట రమణ ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 26-11-2019 న **U1849548 నెంబర్, పాస్‌పోర్ట్** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను ది. 07-02-2025 న తీసుకొని మట్టపర్రు లోని మా ఇంటి నుంచి జిన్నూరు జిరాక్స్ సెంటర్ కు బైకు పై వెళ్ళగా నేను వైజాగ్ లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దారిలో పడి పోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా పై అడ్రస్ కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెం: 98492 95891

పాస్‌పోర్టు పోయినది

అత్తిలి మండలం, కొమ్మర గ్రామం, డోర్ నెం. 2-8/1, ప.గో.జిల్లా, ఎ.పి కి చెందిన మంతెన సత్యనారాయణ రాజు తండ్రి: గోపాలరాజు ప్రజలకు తెలియజేయునది ఏమనగా నేను వైజాగ్ పాస్‌పోర్ట్ ఆఫీస్ నుంచి ది. 05-01-2015 న **M5297694 నెంబర్, పాస్‌పోర్ట్** తీసుకున్నాను. నేను నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ ను ది. 07-02-2025 న తీసుకొని పోడూరు లోని మా బావగారి ఇంటికి పాస్‌పోర్ట్ గురించి చర్చించడానికి వెళ్ళి అక్కడకు సమీపంలోని కవిటంలో జిరాక్స్ సెంటర్ కు బైకు పై వెళ్ళగా నేను వైజాగ్ లో పొందిన నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దారిలో పడి పోయింది. దారిలో ఎంత వెతికినను ఎక్కడా నాకు నా ఒరిజినల్ పాస్‌పోర్ట్ దొరకలేదు. కాబట్టి ఎవరికైనా దొరికితే నా అడ్రస్‌కు ఇవ్వాల్సిందిగా కోరి ప్రార్థిస్తున్నాను.

నా సెల్ నెం: 91777 22333

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

ఐ.పి.నెం.4/2025

వెదురుపర్తి మోజెస్ నారాయణ, S/o. సూర్యనారాయణ, డోర్. నెం. 10-5-2/1, ముమ్మిడివారి వీధి, నరసాపురం, ప॥గో॥జిల్లా. ...పిటీషనర్

మరియు

1. M/s. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్ లిమిటెడ్, నరసాపురం బ్రాంచ్, Rep.by its మేనేజర్ కమ్ GPA హోల్డర్ శ్రీ జి.డి. జగదీష్, ఆంధ్రాబ్యాంక్ రోడ్, నరసాపురం, ప॥గో॥జిల్లా.
2. ఆఫీషియల్ రిసీవర్, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు.

...రెస్పాండెంట్స్

పై నెంబరు ఇన్సాల్వెన్సీ లో పిటీషనర్ 1వ రెస్పాండెంట్ కు చెల్లించవలసిన బాకీ చెల్లించలేని పరిస్థితిలో పిటీషనర్ తనను దివాళా కోరు దారునిగా డిక్లేర్ చేయమని కోరుచూ పై నెంబరున ఇన్సాల్వెన్సీ పిటీషన్ దాఖలు చేసుకొని యున్నాడు. మరియు సదరు ప్రొవిన్షియల్ ఇన్సాల్వెన్సీ యాక్ట్ అండర్ సెక్షన్ 31 ప్రకారం ఇంటీరియమ్ ప్రొటక్షన్ ఆర్డరు కూడా పొందియున్నారు. దానిపై శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం 1,2 రెస్పాండెంట్లకు గాని, మరి ఏ ఇతరులకు గాని సదరు పై నెంబరు పిటీషన్ లో ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల **ది. 28-02-2025 సం.రం. తేదిన ఉదయం గం. 10-30 ని.లకు** శ్రీ కోర్టు వారి యెదుట స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని హాజరై పై పిటీషన్ నందు ఏమైనా అభ్యంతరములు ఉన్న యెడల తెలియజేసుకోవలెను. లేని యెడల పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడునని దరిమిలా వచ్చే ఆక్షేపణలు ఏమి పిటీషనర్లను బైండ్ చేయవని యిందు మూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.వారి పరోక్షమున తీర్పు గావింతురు అని తెలియజేయడమైనది.

కామన బాల సత్యనారాయణ
నరసాపురం — పిటీషనర్ తరపు అడ్వకేట్
ది.14-02-2025 — నరసాపురం

ప్రకటన

మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో

I.P.No. 6/2023

Between:

Petitioner:
Emana Ramanjaneyulu, S/o. Tataiah, R/o. Kanuru Village, Machilipatnam Mandal, Krishna District.

And

Respondents:
1. Parasa Mulaswamy, S/o Peddiraju, R/o. D.No. 1-4, Parasavari Meraka, Turputallu Village, Narsapuram Mandal, West Godavari Distict.
1. Parasa Nagaraju, S/o Peddiraju, R/o. D.No. 1-4, Parasavari Meraka, Turputallu Village, Narsapuram Mandal, West Godavari Distict.

పై నెంబరు Insolvency Petition లో IP. No. 6/2023 రులో సదరు పై 1 & 2వ రెస్పాండెంట్లుకు చాలా కాలము నుండి బేటా కడుతున్నాము. అందున, శ్రీ కోర్టు వారు Dt. 10-1-25 Substitute Service Pablication ఆర్డరు ప్రకారము ఈ Pablication ద్వారా 1 & 2వ రెస్పాండెంట్లుకు తెలియపరచు విషయము అనగా **ది.21-02-2025వ తేదీను** సదరు 1 & 2వ రెస్పాండెంట్లు **ఉదయం గం. 10-00 గంటలకు** మహారాజశ్రీ నరసాపురం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో హాజరు కావలెనని లేని యడల మీకు పరోక్షమున తీర్పు ఇచ్చెదరు. 1 & 2వ రెస్పాండెంట్లుకు ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

బొలిశెట్టి నవీన్‌కుమార్
నరసాపురం — అడ్వకేట్, నరసాపురం
ది.14-02-2025 — సెల్: 81797 05000